ప్రజాశక్తి

గురువారం 28 డిసెంబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

మార్పులు.. చేర్పులు..

అసంతృప్తులు

- ముగ్గురు ఎమ్మెల్యేలకు వైసిపి అధిష్టానం పిలుపు
- ఏ క్షణాన ఏం జరుగునో..

వాసుపల్లి గణేష్ కుమార్

కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో రాజకీయ పరిణామాలు అధికార పార్టీని ఇరకాటంలో పెట్టేలా తయారవుతున్నాయి. దక్షిణం నియోజకవర్గంలో ఇప్పటికే ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌పై అసమ్మతి జ్వాలలు ఎగసిపడుతున్నాయి. ఈ పంచాయతీ కాస్త తాడేపల్లి జగన్ ప్యాలస్ వరకూ వెళ్లింది. తాజాగా తూర్పులో ఒక నాయకుడి పార్టీ మార్పు ఆ పార్టీకి ఒక కుదుపే అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదేగాక పెందుర్తి, చోడవరం, విశాఖ దక్షిణం ఎమ్మెల్యేలు అదీప్‌రాజ్, ధర్మశ్రీ, వాసుపల్లికి అధిష్టానం పిలుపు రావడం చూస్తే మార్పులు, చేర్పులకు వీరి ప్రాతినిధ్యం వహించే కేంద్రాలు గురౌతాయా ? అన్నది చూడాల్సిందే.

అజెండా 2024 ఎన్నికలే...

2024 ఎన్నికల్లో సీటు దక్కించుకోవడమే ఏకైక అజెండాగా విశాఖ రాజకీయాల్లో పలువురు అసంతృప్తిని వ్యక్తం చేస్తూ పార్టీలు మారడానికి సిద్ధమవుతున్నారు. అధికారంలో ఉన్న వైసిపికి ఈ బెడద అత్యధికంగా ఉండడం కనిపిస్తోంది. అధికారం కలిగి ఉన్న ఒక రాజకీయ పార్టీకి ఎన్ని రకాల సమస్యలు ఎదురుకావాలో అన్నీ ఆ పార్టీ విశాఖ కేంద్రంగా ఎదుర్కొంటుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. విశాఖలోని తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వైసిపి నాయకుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ బుధవారం పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. వంశీకి ఎంఎల్‌సి ఇచ్చినా అసంతృప్తితోనే ఆ పదవిలో కొనసాగారు. అధికార పార్టీలో తాజాగా చోటుచేసుకుంటున్న ఈ మార్పులు, చేర్పులు అసంతృప్తులను ఎగదోస్తున్నాయనడానికి ఇదే తార్కాణం. కళ్లెదురుగా రెండు ప్రధాన పార్టీలు టిడిపి, జనసేన ఉండడంతో ఏదో ఒక పార్టీతో సర్దుబాటు చేసుకుని జారిపోతున్నారు. వంశీకృష్ణకు 2009 ప్రజారాజ్యం పార్టీ నుంచి ఈ తరహా పరిస్థితులు ఎదురౌతున్నాయని ఆయన అనుచర గణం వాపోతుంది. 2009లో ప్రజారాజ్యం నుంచి, 2014లో వైసిపి నుంచి పోటీచేసి ఆయన పరాజయం పాలయ్యారు. ఈ క్రమంలో 2019లో వైసిపి తరపున టికెట్ ఇచ్చి ఉంటే అప్పటికే వంశీపైగల సానుభూతి గెలిపించి ఉండేదని అనుచరులు మిగతా 2లో..

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సభలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

మోడీ దిగొచ్చే వరకూ ఉక్కు పోరాటం

- జిందాల్‌తో ఒప్పందాన్ని బహిరంగ పర్చాలి : కార్మిక నేతలు
- జివిఎంసి వద్ద వెయ్యి రోజులకు చేరుకున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ దీక్షలు
- విశాఖలో భారీ ర్యాలీ, సభ

వార్త మెయిన్‌లో..

లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్ల సేవలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు ప్రజలకు సేవలందించాలని, రుణ మంజూరు ప్రక్రియలో సులభతర విధానాలు అమలు చేయాలని బ్యాంకర్లను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ప్రజలకు అన్ని విధాలుగా సహకారం అందించాలని సూచించారు. పెండింగ్ మిగతా 2లో..

ఉల్లాసంగా 'ఆడుదాం ఆంధ్రా'

వార్త 6లో..

రాష్ట్రంలో మంటగలిసిన ప్రజాస్వామ్యం

వార్త 2లో..

ఉద్యోగ భద్రత కోసం వాలంటీర్ల ర్యాలీ

వార్త 2లో..

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్‌వాడీలు

ఎంపీ, ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి

16వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె వార్త 8లో..

మెట్రోతో రూపురేఖలు మారతాయి

- 4 కారిడార్లు.. 76.9 కిలోమీటర్లు
- 8 నిమిషాలకు ఒక మెట్రో రైలు
- స్టీల్‌ప్లాంట్ నుంచి భోగాపురం ఎయిర్ పోర్టుకు రూ.125 ధర
- 'ప్రజాశక్తి'తో ఎపి మెట్రో రైల్ ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ యుజెఎం.రావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'వైజాగ్ మెట్రో రాకతో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయి. ఎక్కడా భవనాలను పడగొట్టడంగానీ, అత్యధిక మంది నిర్వాసితులు అయ్యే పరిస్థితులుగానీ వైజాగ్ మెట్రో రైలు నిర్మాణం వల్ల జరగవు. ప్రాజెక్టు ప్రతిపాదనలన్నీ సిద్ధంగా ఉన్నాయి. సెంట్రల్ హౌసింగ్ టౌన్ డవలప్‌మెంట్ ట్రాన్స్‌పోర్టు మంత్రిత్వ శాఖకు త్వరలోనే డిపిఆర్ పంపనున్నాం. 2024 మార్చిలో కేంద్రం ఆమోదించే అవకాశం ఉంది. ఈలోగా రాష్ట్ర ప్రభుత్వం జీవోను ఇవ్వాల్సి ఉంది. విశాఖ నగరం, చుట్టుపక్కల ప్రాంతాలను అనుసంధానం చేసే రైల్ ప్రాజెక్టు ఇది' అని ఎపి మెట్రో రైలు ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ యుజెఎం.రావు అన్నారు. 'ప్రజాశక్తి'తో వైజాగ్ మెట్రో రైలు గురించి ఆయన పలు విషయాలను పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

మెట్రో రైలు ప్రాజెక్టు కోసం ఏయే పనులు పూర్తయ్యాయి ? ఇది ఎలా ఉండబోతుంది ?



విశాఖలో 2020 అక్టోబర్‌లో ఎపి మెట్రో రైలు ప్రాజెక్టు కార్యాలయాన్ని ప్రారంభించిన నుంచీ వైజాగ్ మెట్రో రైల్ ప్రాజెక్టు అమలుకు కృషి చేపట్టాం. నగర జనాభా ప్రయాణం, ట్రాఫిక్ కష్టాలు, గంటల తరబడి వాహనాల కోసం ఎదురు చూడడం వంటి అంశాలను స్టడీ చేశాం. రోజుకు సుమారు 6 లక్షల మంది ఆటోలు, బస్సులు, ఇతర రవాణా సాయంతో గమ్యస్థానాలకు చేరుతున్నారు. మెట్రో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మెట్రోతో రూపురేఖలు మారతాయి

రైలు వస్తే రెండు గంటల ప్రయాణ కాలాన్ని 40 నిమిషాలకు తగ్గించవచ్చు. అందుకే స్టీల్‌ప్లాంట్ మొదలుకొని కారిడార్లను ప్లాన్ చేశాం. స్టీల్‌ప్లాంట్ గేటు నుంచి కొమ్మాది జంక్షన్ వరకూ 34.40 కిలోమీటర్లు (29 స్టేషన్లు), గురుద్వారా నుంచి పాత పోస్టాఫీసుకు 5.07 కిలోమీటర్లు (6 స్టేషన్లు), తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరుకు 6.75 కిలోమీటర్లు (7 స్టేషన్లు), కొమ్మాది నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు లాంజ్ వరకూ 30.67 కిలోమీటర్లు (12 స్టేషన్లు)గా 76.90 కిలోమీటర్లు మెట్రో నడక ఉంటుంది.

మెట్రో ప్రాజెక్టుల నిర్మాణ సందర్భంలో ప్రజలు నిర్వాసితులౌతారు కదా?

ఒక్క భవనం కూడా విశాఖలో పోదు. వన్‌టౌన్ ఏరియా పోస్టాఫీసు ప్రాంతంలో రోడ్డు విస్తరణ జరగాల్సి ఉంది. ఆర్‌అండ్‌ఆర్ కింద డిపిఆర్‌లో రూ.100 కోట్లు అవసరమని పేర్కొన్నాం. ఇంకా నగర మొత్తం మీద ఎక్కడా ఆర్‌అండ్‌ఆర్ ప్రతిపాదన లేదు.

వైజాగ్ మెట్రో రైలు ప్రాజెక్టు వ్యయం ఎంత?

వైజాగ్ మెట్రో ప్రాజెక్టు కాస్ట్ రూ.14,309 కోట్లు. ఇక్కడ కిలోమీటరుకు రూ.200 కోట్లు ఖర్చవుతుంది. మొత్తంగా 77 కిలోమీటర్ల పొడవు మెట్రో ఇది. భోగాపురం ఎయిర్ పోర్టు లాంజ్ వరకూ మెట్రో లైన్ ఏర్పాటు చేస్తున్నాం. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ నుంచి ఈ ఎయిర్ పోర్టుకు రూ.125 ఛార్జీ ఉంటుందని అంచనా వేశాం. అలాగే ఎయిర్ పోర్టు ఎక్స్‌ప్రెస్ మెట్రో సర్వీసులను ప్లాన్ చేస్తున్నాం. ఇదే మెట్రో రైలు లైన్‌పై చిన్న చిన్న స్టేషన్లు కొన్నింటిలో ఆగకుండా 'ఆపరేటింగ్ ప్లాన్' చేస్తున్నాం. ఒక సర్వీసు నుంచి మరో సర్వీసుకు మధ్య కాలం 8 నిమిషాలే ఉండేలా డిపిఆర్‌లో పేర్కొన్నాం.

ఛార్జీలు ఎలా ఉండబోతున్నాయి?

వోల్వో బస్సుతో సమానంగా కిలోమీటరుకు ఛార్జీ ఉంటుంది. అయితే దూరం ప్రయాణించే విషయంలో రేటు ప్రయాణికులకు కలిసొచ్చేలాగ ప్లాన్ చేస్తున్నాం. ఏదిఏమైనా టెలిస్కోపిక్ రేట్స్ ఫేర్ ఉంటాయి. ధరల నిర్ణయం కేంద్ర ప్రభుత్వం చేస్తోంది. మెట్రో ప్రాజెక్టు పని ప్రారంభమైతే మూడేళ్లలో ఒక లైన్ (స్టీల్‌ప్లాంట్ నుంచి ఎన్ఎడి) వరకూ ప్రజల సౌకర్యార్థం ప్రాజెక్టు పూర్తి చేస్తాం. కేంద్రం నుంచి ఆమోదం రాగానే బిడ్డింగ్‌కు వెళతాం. చెరో 20 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా కాగా, 60 శాతం పిపిపిలో సమకూర్చి మెట్రో పూర్తిచేయాలని ప్రణాళిక రూపొందించాం.

మెట్రో రైళ్లు సక్సెస్ అవుతున్నట్లేనా?

దేశంలో జీరో యాక్సిడెంట్లతో మెట్రోలన్నీ నడుస్తున్నాయి. అంత టెక్నాలజీ అభివృద్ధి జరిగింది. వైజాగ్ మెట్రోకు కన్సల్టెంట్‌గా గురుగామ్‌కు చెందిన యుఎంటిసి వ్యవహరించనుంది. ఎపి, కేంద్ర ప్రభుత్వాల మద్దతు ఉంటుంది. మెట్రో రైల్ సక్సెస్‌కి ఆఖరి గమ్యస్థానం వరకూ కనెక్టివిటీ ఉంటే చాలు. ఇంటి నుంచి ప్రయాణికులను తెచ్చి తిరిగి ఇంటికి తీసుకెళ్లేలాగ ఏర్పాట్లు చేస్తున్నాం. దీనికోసం ఎంవిపి డబుల్ రోడ్డు ప్రాంతంలో 'ఎం' అంటే మెట్రో సింబల్‌తో తూర్పు, పడమర వైపు రెండు 'ఎం' బస్సులను స్టాండ్‌బై ఉంచుతాం. మరో నాలుగు క్యాబ్‌లను సిద్ధం చేసి ఉంచుతాం. ఎంవిపి సర్కిల్‌కి చుట్టూ ఉండే ప్రయాణికులను క్యాచ్ చేయడమే లక్ష్యం.

అసంతృప్తులు

తాజాగా చెబుతున్నారు. 2024 ఎన్నికల్లోనూ ఆయనకు అధికార పార్టీ నుంచి టికెట్ దక్కే అవకాశం లేకపోవడంతో పార్టీని వీడినట్లు తెలుస్తోంది. దక్షిణం నుంచి జనసేన అభ్యర్థిగా వంశీ బరిలోకి దిగుతారన్న ప్రచారం తాజాగా జరుగుతోంది.

పథకాలతో పనౌతుందా?

2019 ఎన్నికల్లో గెలిచాక వాగ్దానాలన్నీ అమలు చేశాం అని చెప్పుకునే వైసిపి ఒక రకంగా గడ్డుకాలంలోనే పడింది. ప్రజలకు పథకాలు దగ్గరైనా తాజాగా వైసిపి అధిష్ఠానం పలు అసెంబ్లీ సెగ్మెంట్లలో అభ్యర్థులను మార్చడం, కొత్తవారిని తేవడం వంటి చర్యలపై దిగువ శ్రేణి కార్యకర్తలు, నాయకులు అసమ్మతి వ్యక్తం చేస్తున్నారు. తూర్పులో ఇప్పటికే అక్కరమాని వెంకటరావు, ఆయన సతీమణి వియంఆర్‌డిఎ ఛైర్మన్ విజయనిర్మల ప్రధాన పార్టీల నేతలతో సంప్రదింపుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో తూర్పు రాజకీయం ఒక్కసారిగా చర్చనీయాంశం అయ్యింది. విశాఖపట్నం ఎంపీగా ఉన్న ఎంవివి.సత్యనారాయణ గడచిన రెండు నెలలుగా తూర్పులో ప్రచారంలో ఉన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపికి బలమైన అభ్యర్థి ఎంవివి అన్న భావనతో వైసిపి అధిష్ఠానం ఉందన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. అభ్యర్థులెవరైనా డబ్బు ప్రభావం లేకుండా ఎన్నికలు సజావుగా జరగవు అన్నది అన్ని ప్రధాన పార్టీలూ గుర్తించడంతో ఆ వ్యాపకంలో నేతలు పడ్డారు. పథకాలు ప్రజలకు వెళ్లినా ప్రభుత్వంపై సమాజంలోని పలు తరగతుల ప్రజానీకంలో వ్యతిరేకత కనిపించడంతో అధికార వైసిపి నేతల్లో గుబులు రేగుతోంది.

లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్ల సేవలు

దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు, ఇళ్ల నిర్మాణాలకు రుణ మంజూరు ప్రక్రియ, సిబిల్ స్కోర్ విధానం, కిసాన్ క్రెడిట్ కార్డుల పంపిణీ, స్త్రీనిధి రుణ ప్రక్రియ తదితర అంశాలపై సమీక్షించారు. పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే పాలసీ విధానాలకు అనుగుణంగా బ్యాంకర్లు వ్యవహరించాలని, ప్రజలకు సులభతర రీతిలో సేవలందించాలని పేర్కొన్నారు. ప్రధానంగా స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకునే వారికి, జగనన్న పేదలందరికీ ఇళ్లు, టిడ్కో పథకంలో భాగంగా నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులకు సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు. టిడ్కో లబ్ధిదారులకు రుణం మంజూరు చేసే క్రమంలో సిబిల్ స్కోర్ ఉండాలనే నిబంధనలో వీలును బట్టి సడలింపు ఇవ్వాలని చెప్పారు. కిసాన్ క్రెడిట్ కార్డు ఉన్న వారికి అన్ని విధాలా సహకరిస్తూ రుణాలను మంజూరు చేయాలన్నారు. ఎంఎస్ఎంఇ సెక్టార్‌లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వారికి సహకరించాలని చెప్పారు.

రాష్ట్రంలో మంటగలిసిన ప్రజాస్వామ్యం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో ప్రజాస్వామిక విలువలు పూర్తిగా మంటగలిశాయని మాజీ అడిషనల్ డిజి సత్యప్రకాష్ అన్నారు. బుధవారం డాల్ఫిన్ హోటల్‌లో విశాఖ సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 40 ఏళ్లలో ఏ ప్రభుత్వం కూడా రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేయ లేదన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం అందుకు భిన్నంగా ఉందన్నారు. ఓ మహిళ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెడితే ఆమెపై కేసు నమోదు చేసి వేధించారని తెలిపారు. ఎపి మాజీ సిఎస్ ఎల్‌వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రజాస్వామ్యమే కొలబద్ద అన్నారు. ప్రజాస్వామ్య విలువలు వ్యాప్తి చెందేలా అందరూ పని చేయాలన్నారు. ఎగ్జిక్యూటివ్, చట్టసభలు, న్యాయస్థానాలు బలంగా పనిచేయాలన్నారు. బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అందరూ రాజ్యాంగబద్ధంగా నడవాలని ఆకాంక్షించారు. ఒక వ్యక్తి నిర్ణయాన్ని బట్టి వ్యవస్థ నడవకూడదన్నారు. రాష్ట్రంలో ఏ తరగతీ ఇప్పుడు సంతోషంగా లేదన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకల పట్ల బాధితులు చింతిస్తున్నారని చెప్పారు. ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ మాట్లాడుతూ ఎపి ప్రభుత్వం ఎపి ల్యాండింగ్ యాక్ట్ తీసుకురావడం వల్ల పలు ఇబ్బందులు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులకే రక్షణ లేదని, న్యాయం జరగటం లేదని తెలిపారు. తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ మాట్లాడుతూ తన ఓటు హక్కును, తన కుటుంబ సభ్యుల ఓటు హక్కులను కావాలనే తొలగించారని చెప్పారు. అందుకు సహకరించిన అధికారులందరిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిటిజన్ ఫోరం ఫర్ డెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ కె.నిరుపారాణి, ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, టిడిపి ఎస్‌సి సెల్ కార్యదర్శి పుచ్చా విజయకుమార్, పద్మనాభానికి చెందిన మాజీ సైనిక ఉద్యోగి మోపాడ ఆదినారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కోసం వాలంటీర్లు ర్యాలీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పని చేస్తున్న వాలంటీర్ల గౌరవ వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ బుధవారం పలువురు వాలంటీర్లు సరస్వతి పార్కు నుంచి జివిఎంసి జోన్ 4 కార్యాలయం వరకు, అనంతరం అక్కడ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుంచి వాలంటీర్లుగా పనిచేస్తున్న తమకు అప్పటి నుంచి ఇప్పటి వరకూ నెలకు కేవలం రూ.5 వేలు గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. దాదాపు నాలుగేళ్లలో అన్ని రకాల వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, విద్యుత్ ఛార్జీలు పెరిగాయని, అదే సందర్భంలో ప్రారంభంలో తమకు చెప్పిన వాటికంటే అదనంగా పనులు చేస్తున్నామని

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వాలంటీర్లు

తెలిపారు. తమ కష్టాన్ని గుర్తించి గౌరవ వేతనం పెంచాలన్నారు. అలాగే గ్రామ సచివాలయ ఉద్యోగుల వలే తమను కూడా రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్‌సిసి, ఎక్స్ సర్వీస్‌మ్యాన్‌లకు ఉద్యోగాల నియామకాలలో 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని, అదేవిధంగా తమకు కూడా ఆ తరహా రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

వాసవి క్లబ్ సేవలు ప్రశంసనీయం

కేలండర్ ఆవిష్కరిస్తున్న వెంకట రమణమూర్తి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని సీతమ్మధార వాసవి క్లబ్ సేవలు ప్రశంసనీయమని కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని కళా హాస్పిటల్ ప్రాంగణంలో వాసవి క్లబ్ సీతమ్మధార ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను హాస్పిటల్ సిబ్బంది చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట రమణమూర్తి మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా వాసవి క్లబ్ వారు నిర్విరామంగా అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ యశస్వి, వాసవి క్లబ్ ప్రతినిధి సుగుణ కుమార్, కళా గ్రూప్స్ హెచ్ఆర్ పంచాది వెంకటకృష్ణ (నాని), రేణుక ఎల్లమ్మ గుడి సెక్రటరీ పోలారావ్, ఆలయ ప్రధాన అర్చకులు కె.కామేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారానికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బుధవారం దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎల్.చైతన్య, అధ్యక్షులు వి.పుండరీకాక్ష మాట్లాడారు. ఎమ్మెల్సీ రఘు వర్మ, టిడిపి నేత శ్రీభరత్ మద్దతు తెలిపారు.

గంగవరం పోర్టు - తుంగ్లాం రోడ్డు నిర్మాణంపై సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గాజువాక, ఆటోనగర్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు గంగవరం అదానీ పోర్టు నుంచి కార్గో వాహనాల రాకపోకలు సులువుగా సాగేందుకు అనువుగా సాగరమాల ప్రాజెక్టులో భాగంగా నిర్మించ తలపెట్టిన గంగవరం పోర్టు - తుంగ్లాం హైవే రోడ్డు నిర్మాణంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సమీక్షించారు. స్థానిక ప్రజలు, పరిశ్రమల నిర్వాహకుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని మార్చిన అలైన్మెంట్, కొత్త డీపీఆర్ రూపకల్పనపై సంబంధిత అధికారులతో వియంఆర్‌డిఎ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం ప్రత్యేకంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, శ్రావణ్ షిప్పింగ్ అధినేత జి.సాంబశివరావు, ఎన్‌హెచ్ఎఐ పీడీ ప్రభత్ రంజన్, గంగవరం అదానీ పోర్టు సీఈవో గాంధీ పాల్గొన్నారు.

ఐఎన్ఎస్ కళింగ కమాండింగ్ ఆఫీసర్‌గా ప్రదీప్ పటేల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఐఎన్ఎస్ కళింగ కమాండింగ్ ఆఫీసర్‌గా కమాండర్ ప్రదీప్ పటేల్ బాధ్యతలు స్వీకరించారు. ఐఎన్ఎస్ కళింగలో జరిగిన కార్యక్రమంలో కమాండర్ సిఎస్ నాయర్ నుంచి ఆయన ఈ బాధ్యతలు చేపట్టారు.

పేరు మార్పు

నేను, కుచర్లపాటి ప్రభ (పాత పేరు), భర్త కుచర్లపాటి వెంకట సత్యనారాయణరాజు, నివాసం : ప్లాటు నంబరు 204, సంజీవిని మాన్షన్, ప్రియా గార్డెన్స్, సింహాచలం, విశాఖపట్నం - 530028, ఆంధ్రప్రదేశ్. సెల్ 9440174217.
నా యొక్క పేరును కుచర్లపాటి ప్రభ (కొత్తపేరు) మార్పుకున్నాను. ఇక మీదట నేను అన్ని వ్యవహారాల్లోనూ కుచర్లపాటి ప్రభగా పిలవబడతాను.

పాస్‌పోర్టు పోయినది

నా పేరు జిల్లేలమూడి సుధీర్‌కుమార్ S/o జిల్లేలమూడి వెంకటరమణ. తేదీ.28/10/23 మద్దిలపాలెం నుంచి బిర్లా జంక్షన్‌కు బైకు మీద వెళుతుండగా మార్గ మధ్యంలో నా పాస్‌పోర్టు పడిపోయినది. నా పాస్ పోర్టు నెంబర్ K5113399 ఎవరికైనా దొరికిన యెడల క్రింది ఫోను నంబరుకు తెలియజేయగలరు.
సెల్ : 8004451306

మహారాజశ్రీ గాజువాక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P 63/2021 IN O.S. 91/2015
Between :
దుగ్గపు సత్యనారాయణ, s/o దానయ్య, హిందూ, వయసు 35సం॥లు, ఉద్యోగి, డోర్‌నెం. 30-6-5, దుగ్గపువానిపాలెం, వడ్లపూడి RHC, విశాఖపట్నం
... D.H.R
And
అయితి భాగ్యలక్ష్మి ... JDR
ఆర్డర్ 21 రూల్ 22 నోటీసు
To,
JDR : అయితి భాగ్యలక్ష్మి w/o కన్నారావు, హిందూ, వయసు 45సం॥లు
D.No 30-85-2, తెలుకుల వీధి, కణితి విలేజ్, వడ్లపూడి, విశాఖపట్నం
పై నెంబరు **E.P**లో శ్రీ కోర్టువారు పంపిన నోటీసులు మీరు అందుకోనందున పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం 04.01.2024 తేదీకి వాయిదా వేసియున్నారు కావున ఆ రోజు ఉదయం 10.30ని॥లకు మీరు స్వయంగా గాని లేక మీ తరపున లాయరు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షముదు పై నెంబరు **E.P.** తీర్మానించబడును.
ఎ.వెంకటేశ్వర్లురావు,
బి.మాధవి
అడ్వకేట్స్, గాజువాక

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT: SRUNGAVARAPU KOTA
I.A.4/2023 in O.S.27/2021
Between:
Gulamjji Vara Lakshmi & another
...Petitioners/Plaintiffs
And
J. Ramulamma & others
...Respondents/Defendants
NOTICE
To,
Proposed Respondent/Defendant:
R-12: Majji Sujatha, W/o. Vijaya Venkata Gopinadh, Aged about 40 years, R/at D.No.C-13, Diguva Veedhi, Tarluvawada Village, Visakhapatnam (M) & District.
Please take notice that the above-named petitioners/plaintiffs has instituted the above I.A.4/2023 in O.S.27/2021 against you and the matter stands posted to **05-01-2024** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **05-01-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.
SARIKA HARIBABU, Advocate
Vizianagaram, **Cell: 8919146166.**

పారిశుధ్య కార్మికుల ధర్నా

మధురవాడ జోనల్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిరసన తెలుపుతన్న కార్మికులు

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జివిఎంసి ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, పారిశుధ్య, ఇతర విభాగాల కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవ్వ నరసింగరావు, రాజు, శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పిఎం పాలెం : రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మున్సిపల్ కార్మికులు మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి ఎంవి.ప్రసాద్ మాట్లాడుతూ, గత ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలుచేయకుండా అన్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సిహెచ్.శేషుబాబు, జి.కిరణ్, బి.నర్సింగరావు, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు కె.సన్ని, ఎస్.చిన్న, ఎ.అశోక్, సిఐటియు నాయకులు డి.అప్పలరాజు పాల్గొన్నారు.

గాజువాక : పారిశుధ్య కార్మిక సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సిఐటియు నాయకులు ఎం రాంబాబు, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు గాజువాక సిఐటియు కార్యాలయంలో బుధవారం సాయంత్రం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాము, నక్క నాగరాజు, గణేష్, కె.కిరీటం, మీనాక్షి, కుమారి, వై.చిన్నారావు పాల్గొన్నారు.

ఆరిలోవ : జివియంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఆరిలోవ కాలనీలోని సీవేజ్ ప్లాంట్ వద్ద ఆందోళన చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ ఒప్పంద పారిశుధ్య కార్మికులు పెద్ద ఎత్తున నినదించారు. చెత్తను సేకరించే వాహనాలను బయటకు పోకుండా అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మున్సిపల్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ వర ప్రసాదరావు, సిఐటియు నాయకులు శంకరరావు, బి.రత్నం, గణపతి, కనకరాజు, ఈశ్వరరావు, రాజశేఖర్, భవాని తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో వంటావార్పు

అనకాపల్లి : తమ సమస్యల పరిష్కారానికి నిరవధిక సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు బుధవారం రెండోరోజున అనకాపల్లిలోని జీవిఎంసి జోనల్ కార్యాలయం వద్ద వంట వార్పు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా కార్మిక యూనియన్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ వర్కర్లు అందరినీ పర్మినెంట్ చేయాలని, క్లాప్ డ్రైవర్లకు నైజ18,500 వేతనం ఇవ్వాలని, ఇంజనీరింగ్ వాటర్ వర్క్స్ ,పార్కుల్లో పనిచేసే మున్సిపల్ కార్మికులకు హెల్త్ అలవెన్సులు మంజూరు చేయాలని, పర్మినెంట్ ఉద్యోగుల లీవ్ ఎన్ కాస్మెంట్ ,సరెండర్ లీవులు జిపిఎఫ్ సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకనరావు, మున్సిపల్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గంటా శ్రీరామ్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు బొమ్మాల రాము, ఎర్రంశెట్టి ఏసురాజు ,అజయ్ కుమార్, నూకరాజు,శివ పాల్గొన్నారు.

అనకాపల్లిలో వంటా వార్పు చేస్తున్న కార్మికులు

నర్సీపట్నం టౌన్:తమ సమస్యలు పరిష్కరిం చాలని మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె రెండో రోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియం వద్ద నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియ) నర్సీపట్నం ప్రెసిడెంట్ బొర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ, నర్సీపట్నం మున్సిపాలిటీలో మున్సిపల్ కార్మికులు సుమారు 100 మంది వరకు పని చేస్తున్నారని, వారికి పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. కరోనాలో కార్మికులు ప్రాణాలు తెగించి అందిస్తే తొలగించడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవిజిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, మున్సిపల్ కార్మికలు కుపరాల రాజు, దేముడు, కుమార్ తదితర్లు పాల్గొన్నారు.

28, 29న అవంతిలో జాబ్ మేళా

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 28, 29 తేదీల్లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య బుధవారం తెలిపారు. ఐటి, ఫార్మా, మాన్యుఫ్యాక్చరింగ్, రిటైల్, ఆటోమొబైల్, బ్యాంకింగ్, మార్కెటింగ్, బిపిఒ సెక్టార్లకు సంబంధించి 40 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8555868681, 9948768778 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రెడ్డిపల్లిలో ట్యాబులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

రెడ్డిపల్లిలో ట్యాబుల పంపిణీ

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థులు 55 మందికి ట్యాబులను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం పాఠశాలలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఇష్టపడి చదువుతూ జీవితంలో ఎదగాలని సూచించారు. మనం జీవించడమే కాకుండా పదిమందికి జీవించే అవకాశం కల్పించేలా ఎదగాలన్నారు. మండలంలోని 11 పాఠశాలకు 459 ట్యాబులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ గిరిబాబు, వైసిపి మండల అధ్యక్షులు కె.లక్ష్మణరావు, వైస్ ఎంపిపి రాజేశ్వరి. ఎంఇఒలు రమణ, బాబూలాలు, ప్రధానోపాధ్యాయులు ఎం.సన్యాసిరావు, నాయకులు ఆదిబాబు, ఈశ్వరరావు, బి.గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బోని శ్రీనును అభినందిస్తున్న మేయర్ గొలగాని హరి వెంకట కుమారి

యువజన విభాగం అధ్యక్షునిగా బోని శ్రీను

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ తూర్పు నియోజకవర్గ క్లస్టర్ -1 వైసిపి యువజన విభాగం అధ్యక్షునిగా ఆరిలోవ 11వ వార్డుకు చెందిన బోని శ్రీను నియమితులయ్యారు. వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డు అప్పలనాయుడు ఆధ్వర్యాన పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులను, మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని శ్రీను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బోని శ్రీను మాట్లాడుతూ, తన మీద నమ్మకంతో యువజన విభాగం అధ్యక్షునిగా నియమించిన ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డికి, వైసిపి సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

కోరాడలో పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు

ఎనీ టైం మనీ పద్ధతిలో పంటల సాగు

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండలం కోరాడ గ్రామంలో ఎనీ టైం మనీ మోడల్ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పొలాలను బుధవారం రీజనల్ అధికారి ప్రకాష్ సందర్శించారు. ఈ విధానంలో పంటల ద్వారా 365 రోజులూ రైతుకు ఆదాయం లభిస్తుందని రైతులు వివరించారు. ఎనీ టైం మనీ అనే పద్ధతిలో రైతులకు పలు పంటల సాగుపై అవగాహన కల్పిస్తూ రైతులకు ఎక్కువ ఆదాయం వచ్చేలా కృషి చేస్తున్నామని ప్రకాష్ చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ అనురాధ, మండల వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా పంపిణీ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం మామిడిలోవ గ్రామానికి చెందిన బలిరెడ్డి నాగేశ్వరరావు, ఆడాడ మహేశ్వరావు ఇటీవల మరణించడంతో ఆయా కుంటుబాలకు వైఎస్ఆర్ బీమా తక్షణ సహాయంగా రూ.10 వేలను పంచాయతీ వైసిపి అధ్యక్షులు బలిరెడ్డి మహేష్ అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బలిరెడ్డి మల్లికార్జునరావు, డోల దేముడు, సచివాలయ కన్వీనర్ నాగేశ్వరరావు, గంద్రెడ్డి గోవింద్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : చిప్పాడ దివీస్ ఆధ్వర్యాన తూడెం ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 217 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు జరిపారు. పంచాయతీ సర్పంచ్ నరసయ్యమ్మ, పోలిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ తిరుపతిస్వామి, సిబ్బంది, దివీస్ సిఎస్ఆర్ మేనేజర్ సురేష్‌కుమార్, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు, హెచ్‌ఎం అప్పన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- ఆనందపురం : వెల్లంకి విద్యుత్‌లైన్ నిర్వహణ, మరమ్మతులను దృష్టిలో పెట్టుకుని గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎఇ సురేష్‌కుమార్ తెలిపారు. వెల్లంకి, బొడ్డపాలెం, గొరిపేట తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, గృహ, వాణిజ్య, వ్యవసాయ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అవంతిలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్నోవేషన్ ఇన్ మిషన్ లెర్నింగ్ పెడగాగి అంశంపై మూడు రోజుల పాటు జరుగనున్న డెవలప్‌మెంట్ ప్రోగ్రాం బుధవారం ప్రారంభమైంది. జెఎన్‌టియు విజయనగరం అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ డీప్ లెర్నింగ్‌లో న్యూరల్ నెట్‌వర్క్ తదితర అంశాలపై సమకాలీన ఉదాహరణలతో వివరించారు. ప్రస్తుత సమాజంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లో మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ ప్రాధాన్యతను వివరించారు. గౌహతి ఐఐటి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.విజయసారథి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, కన్వీనర్ డాక్టర్ జి.సత్యనారాయణ, కో-కన్వీనర్ పి.శ్రీలక్ష్మి, వివిధ కళాశాలల నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మిద్ది తోటలు పెంచుదాం : మేయర్

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ నగరాన్ని హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు మిద్దె తోటల పెంపకం చాలా అవసరమని, ఆదిశగా జివిఎంసి నగర ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టినందున నివాసితులు సహకరించాలని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. 13వ వార్డు ఆరిలోవ కాలనీలో మిద్దె మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతతో కలిసి బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఎకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా ఎకో గ్రీన్ టెర్రస్ గార్డెన్ అభివృద్ధి కోసం ప్రతి అపార్టుమెంట్‌పై, భవనాలపై, గేటెడ్ కమ్యూనిటీల్లో మిద్దె తోటల ఏర్పాటుకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా టెర్రాస్‌పై విరివిగా మొక్కలను పెంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్సీ కనకమహాలక్ష్మీ, పిడి డి.లక్ష్మి, డిపిఒ ప్రసాద్, ఎస్ఆర్‌యు మేనేజర్ శ్రీనివాస్ రాజమణి, గ్రీన్ క్లైమేట్ ప్రతినిధి జెవి.రత్నం, వైసిపి నాయకలు పాల్గొన్నారు.

మొక్కలను అందిస్తున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

జిందాల్‌తో ఒప్పందాన్ని రద్దుచేసుకోవాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు జిందాల్‌తో చేసుకున్న ఒప్పందాన్ని రద్దుచేసుకోవాలని విశాఖ ఉక్కు పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 1050వ రోజుకు చేరుకున్నాయి. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలకు 1000 రోజులు కావడంతో దానికి సంఘీభావంగా వేలాదిమంది కార్మికులు కూర్మన్నపాలెం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, ప్రాణ త్యాగాలకైనా సిద్ధపడి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకుంటామని స్పష్టంచేశారు. రూ.3000 కోట్ల పెట్టుబడి పెడితే రూ.5 లక్షల కోట్ల లాభం వచ్చే కంపెనీ అని తెలిపారు. పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ, స్టీల్ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయకుండా యాజమాన్యం అన్యాయం చేస్తోందని విమర్శించారు. నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లో ఐదు వేల ఉద్యోగాలు భర్తీ చేయకుండా కేంద్రం స్టీల్ యాజమాన్యంపై ఒత్తిడి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు కెఎస్ఎన్.రావు, యు.రామస్వామి, వైటి.దాస్, కారు రమణ, డి.సురేష్‌బాబు, రామ్మోహన్‌కుమార్, గణపతి రెడ్డి, సిహెచ్.సన్యాసిరావు, ఎన్.రామారావు, జె.రామకృష్ణ, వి.ప్రసాద్, వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ

ప్రజాశక్తి-సీతమ్మధార : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో బుధవారం వైసిపి సమన్వయకర్త కెకె.రాజు బాధిత కుటుంబాలకు అందజేశారు. గుడాల రామకృష్ణ పరమహంస కు రూ.5లక్షలు, ఆళ్ల నరేష్ బాబుకు రూ.1లక్ష, లంకపల్లి ఆనందరావుకు రూ.65 వేలు చెక్కులను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, నాయకులు కిరణ్‌రాజు, ఆళ్ల శివగణేష్, పైడి రమణ, నీలి రవి తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డు పరిధి కప్పరాడలో రూ.19.90 లక్షలతో జెఎన్ఎన్‌యుఆర్‌ఎం గృహాల వాటర్, సెప్టిక్ పైపులు, ట్యాంకుల మరమ్మతులు, కప్పరాడ మార్క్స్ సెంటర్ వద్ద కొండవాలు ప్రాతంలో రూ.19లక్షల వ్యయంతో రిటైనింగ్ వాల్ నిర్మాణాలకు స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యాన ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఇ శేఖర్, డిఇ భరణి, సతీష్, ఎఇ మోహన్, చాణుక్య, వసంతల అప్పారావు, గురువొజి, సుకుమార్, సురేష్, కనకరాజు, అనిల్, చందురెడ్డి, సాయి, శ్రీనివాస్, జయకుమార్, తారకేసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలను తిలకిస్తున్న సత్యనారాయణ

'విశాఖ'లో ప్రాజెక్టు ఎక్స్‌పో

ప్రజాశక్తి-వేపగుంట : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో విద్యార్థులకు ప్రాజెక్టు ఎక్స్‌పో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రయోగాల ప్రదర్శనలను కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ తిలకించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ, ఉత్తమ పద్ధతులు అవలంభిస్తూ ఒక ఆశయంతో ముందుకు సాగుతూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. నూతన ఆలోచనలతో ఆవిష్కరణలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.ప్రసాద్, అధ్యాపకులు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో గడపగడపకు...

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బుధవారం రెండో రోజు కూడా కొనసాగింది. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ గిరిబాబు, వైసిపి మండల అధ్యక్షులు కె.లక్ష్మణరావు, వైస్ ఎంపిపి రాజేశ్వరి, నాయకులు రాజబాబు, మామిడి శివ, చందక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కరాసలో సిసి కెమెరాలు ప్రారంభం

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధి న్యూ కరాస ప్రాంతంలో నివాసితులు ఏర్పాటుచేసుకున్న సిసి కెమెరాలను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రజల్లో చైతన్యం కలిగి వారి భద్రత కోసం సిసి కెమెరాలు ఏర్పాటుచేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వెదుళ్ల శ్రీను, భీమారావు కాలనీ వాసులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన బలిరెడ్డి అప్పారావు

ప్రజాశక్తి ములగాడ : ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎస్‌విఎల్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత బలిరెడ్డి అప్పారావు వైసిపి నుంచి జనసేన పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా అప్పారావును ఇండస్ట్రియల్ ఏరియా కాపు సంఘం సభ్యులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ, జనసేన సిద్ధాంతాల కనుగుణంగా పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మజ్జి మాలినాయుడు, వర్మ, పాల్గొన్నారు.

అప్పారావును అభినందిస్తున్న మజ్జి మాలినాయుడు

భవన కార్మికులకు సంక్షేమ బోర్డు అమలుచేయాలి

సిఐటియు

సంతకాలు సేకరిస్తున్న కార్మిక నాయకులు

ప్రజాశక్తి- ములగాడ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును అమలుచేయాలని సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు 59వ వార్డు పరిధి లేబర్ జంక్షన్‌లో బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. సంక్షేమ బోర్డులో ఉన్న డబ్బులను కాజేసి పబ్బం గడుపుకుంటుందని విమర్శించారు. 1214 మెమో ఇచ్చి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయొద్దని సిఎం జగన్మోహన్‌రెడ్డి చెప్పడం దుర్మార్గమన్నారు. భవన నిర్మాణ కార్మికులు ప్రమాదంలో మృతిచెందితే రూ. 2 లక్షల నుంచి రూ.5లక్షల వరకు వచ్చేవని, మహిళలకు ప్రసూతి నిమిత్తం రూ.20వేలు ఇచ్చేవారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఈ పథకాలు అందడం లేదన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టే ధర్నాలో భవన నిర్మాణ కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మల్కాపురం జోన్ అధ్యక్షులు జె.రామునాయుడు, కార్మికులు యు.రాజు, శ్రీను, సురేష్, రాజేష్, సుభానీ, అప్పారావు నూకరాజు తదితర్లు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలను దెబ్బతీయొద్దు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని కార్మిక సంఘాలపై కొన్ని కార్మిక సంఘాల నేతలు ఆరోపణలు చేస్తూ ఐక్య ఉద్యమాలను దెబ్బతీయొద్దని ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ కోరారు. ప్లాంట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్లాంట్ పరిరక్షణకు కార్మిక సంఘాలు ఐక్య ఉద్యమాలతో ముందుకు సాగుతున్నాయని, ఈ క్రమంలో కొంత మంది లేని పోని ఆరోపణలు చేసి ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేసేందుకు చేస్తున్న ప్రయత్నం సరికాదన్నారు. జిందాల్ సంస్థతో ఎంఒయును తక్షణమే రద్దు చేసుకోవాలని అన్ని కార్మిక సంఘాలు కలిసి సిఎమ్‌డిని దిగ్బంధం చేశామన్నారు. జిందాల్ సంస్థతో స్టీల్‌ప్లాంటుకు ముప్పు ఉందని గ్రహించి పోరాట కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు పరిపాలన భవనం ముట్టడి కార్యక్రమం చేపట్టామని తెలిపారు. కార్మిక సంఘాలు ఏ నిర్ణయం తీసుకున్నా అది ప్లాంట్ పరిరక్షణకు మాత్రమేనని పేర్కొన్నారు. తక్షణమే వేతన సవరణతో పాటు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎన్.రాజు, బిఎంకె.నాయక్, పివి.రమణమూర్తి, వెంకటరాజు, గొందేశి ప్రభాకరరెడ్డి, గంటా కామరాజు, కొవిరి అవతారం, డి.మోహన్, ఆర్.కోటేశ్వరరావు, ఎ.గోపాలరాజు, ఎంఎస్ఆర్.ప్రసాద్, మింది దేముడు, ఎస్ఎ.నాయుడు, పీవీ.నగేష్, డి.సాహూ, సుబ్బారావు, గంగవరం గోపి, నర్సింగరావు, లోకేష్, పోలీస్ నాయుడు, పల్లం గోపి, పి.పోతారెడ్డి పాల్గొన్నారు.

ఎన్ఐఒతో గీతం అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి-మధురవాడ : దేశంలోని ప్రఖ్యాత సముద్ర పరిశోధన సంస్థలలో ఒకటైన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫి (ఎన్ఐఒ)తో సంయుక్త పరిశోధనలు జరపడానికి, పరస్పర సహకారానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్, శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, ఎన్ఐఒ ఇన్‌ఛార్జి శాస్త్రవేత్త ప్రొఫెసర్ వివిఎస్ఎస్.శర్మ అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. రెండు సంస్థలు మధ్య కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా సంయుక్త పరిశోధన ప్రాజెక్టులను నిర్వహించడం, విశ్వవిద్యాలయంలో పరిశోధకులకు ఎన్ఐఒ శాస్త్రవేత్తల మార్గదర్శకం వహించడం, గీతం అధ్యాపకులకు వర్క్‌షాప్‌లు, సదస్సుల నిర్వహణలో సహకరించడం, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, సమాజహిత పరిశోధనలలో సంయుక్త అధ్యయనాలు చేపట్టాలని నిర్ణయించారు. కాగా ఈ సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ మాట్లాడుతూ విశాఖలో సముద్ర సంబంధ పరిశోధనలకు గల విస్తృత అవకాశాల దృష్ట్యా ఎన్ఐఒ మరియు సిఎమ్ఎఫ్ఆర్ఐ వంటి కేంద్ర పరిశోధన సంస్థల సహకారాన్ని తీసుకోనున్నామని తెలిపారు. గీతం బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.కిరణ్మయి మాట్లాడుతూ గీతంలో దాదాపు 30 మంది అధ్యాపకులు సముద్ర అధ్యయనాలపై పరిశోధనలు జరుపుతున్నారని, 35 పరిశోధన ఫలితాలపై పేటెంట్ హక్కులకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం ఐదు భారీ పరిశోధన ప్రాజెక్టులు నిర్వహణలో ఉన్నాయన్నారు. గీతంలో ప్రారంభించనున్న బయోనెస్ట్ ప్రాజెక్టు వివరాలను ప్రొఫెసర్ ఎమ్.అనిత వివరించారు. కార్యక్రమంలో రీసెర్చ్ డెవలప్‌మెంట్ డైరక్టర్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు, ఎన్ఐఒ శాస్త్రవేత్త డాక్టర్ దామోదర్ బెల్లే షెనాయ్, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2,06 కోట్లు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన ఆదాయం రూ.2,06,69,033 వచ్చిందని ఇఒ సింగాల శ్రీనివాసమూర్తి తెలిపారు. గడిచిన 30 రోజులకు సంబంధించి బుధవారం ఇఒ పర్యవేక్షణలో హుండీలు తెరిచి లెక్కించారు. నగదు రూ.2,06,69,033, బంగారం 120 గ్రాములు, 10 కేజీల 30 గ్రాములు వెండి, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు లభించినట్లు పేర్కొన్నారు.

కళ్లద్దాల పంపిణీ

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎన్‌టిఆర్ సేవాసమితి, గీతం ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యాన ఇటీవల నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో అవసరమైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. 12వ వార్డు ఆరిలోవ తోటగరువు టిడిపి కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు హాజరై 50 మంది రోగులకు కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గీతం ఆసుపత్రి యాజమాన్యం పేదలకు అందిస్తున్న వైద్య సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, వార్డు ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ముగడ రాజారావు, బుడుమూరు గోవిందు, పోలారావు, ఏడువాక సన్యాసిరావు, మూది అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డులోని ఆరిలోవ 14, 15 సచివాలయ పరిధిలో వైసిపి నాయకులు గొలగాని శ్రీనివాసరావు ఆధ్వర్యాన 'ఎపికి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, కన్వీనర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలో పలు అభివద్ధి పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్టీసీ కాలనీ, వాంబే కాలనీ, స్వతంత్రనగర్ పార్కు, నగరంపాలెం, చంద్రంపాలెం, పిలకవానిపాలెంలో రోడ్లు, కాలువలు, పార్కు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతిన శ్రీనివాసరావు, పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, జగుపల్లి నరేష్, పోతిన శేషు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

వైద్యఆరోగ్య సేవలపై సంతృప్తి

రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ హేమంత్

ప్రజాశక్తి -మునగపాక : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎ.హేమంత్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పిహెచ్‌సిలో ఓపి, వైద్యపరీక్షలపై డాక్టర్ దుర్గ ప్రవల్లికను అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాటిపల్లి కస్తూరా పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్స్‌ను సందర్శించారు. రక్తహీనత గల పిల్లలను గుర్తించి పౌష్టకాహారం గురించి వివరించారు. రెండు పూటలా ఐరన్ మాత్రలు ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. రక్తహీనత అనర్థాలను వివరించారు.కార్యక్రమంలో వైద్యాధికారి డా. దుర్గా ప్రవల్లిక, ఎంఈఓ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ రాణి, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం ఉమా మహేష్, ఎం ఎల్ హెచ్ పి దుర్గ, వైద్య సిబ్బంది జ్యోతిలాల్, సుజాత, ధనలక్ష్మి, స్కూల్ ఉపాధ్యాయులు, ఆశా భవాని పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న భోజన కార్మికులు

ప్రజాశక్తి - బుచ్చయ్య పేట : సమస్యల పరిష్కారానికి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వచ్చేనెల ఐదున చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మధ్యాహ్నం భోజన నిర్వాహకుల సంఘం మండల అధ్యక్షులు పి.ఉమ తెలిపారు. బుధవారం బుచ్చయ్యపేటలో నిర్వహించిన సమావేశం మాట్లాడుతూ భోజన పథకం కార్మికులకు కనీస వేతనం రూ.పదివేలు చెల్లించాలని, రేషనలైజేషన్ వల్ల ఉపాధి కోల్పోయిన కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధిని చూపించాలని, ధరల పెరుగుదలకు అనుగుణంగా బడ్జెటును పెంచాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రైవేట్ సంస్థలకు భోజన పథకాన్ని అప్పగించరాదని, రాజకీయ వేధింపులను ఆపాలని కోరారు. ఈ సందర్భంగా చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పి లక్ష్మి, ఎస్. లక్ష్మి పాల్గొన్నారు

మున్సిపల్ బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం

ప్రజాశక్తి - యలమంచిలి : స్థానిక మున్సిపాలిటీ అంచనా, సవరణ బడ్జెట్లను కౌన్సిల్ ఆమోదించింది. బుధవారం చైర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మూడునెలల ముందుగానే సవరించిన బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. రానున్న 2024 - 25 అంచనా బడ్జెట్‌కు కూడా రూ.7.94కోట్లకు కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. పెద్దగా చర్చ లేకుండానే బడ్జెట్ చదవడంతో కార్యక్రమం ముగిసింది. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బడ్జెట్, అత్యవసర, రెండవ కౌన్సిల్ 42వ సాధారణ సమావేశాలు కలగలిపి మూడు సమావేశాలు నిర్వహించారు.

అనుకున్న సమయానికంటే గంట ఆలస్యంగా మొదలైన సమావేశంలో కొన్ని వీధుల్లో దీపాలు ఎందుకు వెలగడం లేదని వైస్ చైర్‌పర్సన్ బెజవాడ నాగేశ్వరరావు కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధిని నిలదీశారు. మళ్లీ మొదలైన కోతల సమస్య పరిష్కరించాలని కమిషనర్‌కు చైర్ పర్సన్ సూచించారు. బడ్జెట్ సమావేశంలో కమిషనర్ కె.వి.కొండలరావు,మేనేజర్ ప్రభాకరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాస్, టిపిఒ శ్రీలక్ష్మి, ఆర్వో నీలిమ, వైస్ చైర్మన్ ఆరెపు గుప్తా లు పాల్గొన్నారు. 2019లో అవుట్‌డోర్ ఫిట్‌నెస్ ఎక్విప్‌మెంట్ (జిమ్), మొబైల్ పేమెంట్ టెర్మినల్స్ సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వానికి రూ.7,25,076లు చెల్లించాలని తీర్మానం జరిగినప్పటికీ, దాని గురించి తమకు స్పష్టంగా తెలిదని కొందరు కౌన్సిల్ సభ్యులు చెప్పడం విశేషం.

ప్రాథమిక పాఠశాలలకు \ అంగన్వాడీలను అనుసంధానించొద్దు

డిఇఒకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ప్యాప్టో నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రాథమిక పాఠశాలలకు అంగన్వాడీ కేంద్రాలనుఅటాచ్ చేయటం సరికాదనిఫ్యాప్టో అనకాపల్లి జిల్లా నాయకులు కోరారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా చైర్మన్ గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ తమ సమస్యలపై మూడేళ్లుగా అంగన్వాడీలు మొరపెట్టు కుంటున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈనెల 12న సమ్మెబాట పట్టారని, ఇపుడు అంగన్వాడీలో చదువుతున్న పిల్లల్ని ప్రాథమిక పాఠశాలలకు అటాచ్ చేసి, వారికి మధ్యాహ్న భోజనం పెట్టాలని చెప్పడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. దీనికయ్యే ఖర్చు ఎక్కడినుంచి ఇస్తారో అధికారులు చెప్పలేదన్నారు. అలాగే అంగన్వాడీ పిల్లల భద్రతకు ఎవరిని బాధ్యులను చేస్తారని ప్రశ్నించారు. ప్రాథమిక పాఠశాలలో చాలా పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా నడుస్తున్నాయన్నారు. ఇప్పటికే ప్రాథమిక పాఠశాలలో బోధనేతర పనులు విపరీతంగా ఉన్నాయని, ఇది మరింత భారంగా మారుతుందన్నారు. ఇటువంటి అంగన్వాడీ పాఠశాలలను తమ పాఠశాలలో పిల్లలతో అటాచ్ చేయవద్దనికోరారు. సెక్రటరి జనరల్ వై. సుధాకర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేస్తూజారీ చేసిన మౌఖిక ఉత్తర్వులు వెంటనే ఉపసంహరించు కోవాలని కోరారు. అంగన్వాడీల పోరాటానికి తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కో చైర్మన్ సాయి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు ఎస్. దుర్గా ప్రసాద్, కెఎవిఎస్. ఆచంట రవి, ధర్మారావు, కార్యకర్తలు వై. శ్రీనివాస్ రావ్, మధు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలి

జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

పొటెన్షియల్ లింక్డ్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి బ్యాంకు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన డిసిసి డిఎల్ఆర్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ శాఖల ద్వారా లబ్ధిదారులకు సంబంధించిన రుణాలు మంజూరు చేయడంలో అవసరమైన డాక్యుమెంట్ల పట్ల వారికి అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన రుణాలను వీలైనంత వేగంగా అందజేసేందుకు కృషి చేయాలన్నారు. గతంలో వారు చేసిన రుణ చెల్లింపులు, బ్యాంకు లావాదేవీలను ప్రామాణికంగా తీసుకోవచ్చున్నారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి రుణాలు త్వరగా అందజేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులతో మాట్లాడాలన్నారు. డిఆర్‌డిఏ, వ్యవసాయ పశుసంవర్ధక, పరిశ్రమల శాఖల అధికారులు బ్యాంకు అధికారులను సమన్వయం చేసుకుంటూ తమ శాఖకు చెందిన లబ్ధిదారులకు రుణాలు వీలైనంత వేగంగా మంజూరయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అంతకుముందు లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ శాఖల ద్వారా అందజేసిన రుణాలను వివరించారు.అనంతరం పొటెన్షియల్ లింక్డ్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కన్వీనర్, యు.బి.ఐ. రీజనల్ మేనేజర్ పి.నరేష్, ఆర్‌బిఐ ఏజీఎం హనుమ కుమారి, నాబార్డ్ ఏజిఎమ్ సమంత్, మెప్మా పీడీ సరోజినీ, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ప్రసాద్ రావు వ్యవసాయ శాఖ జెడి మోహనరావు ఉద్యానవన శాఖ డిడి ప్రభాకరరావు డిఆర్‌డిఏ పీడీ శచీదేవి, మత్స్యశాఖ డిడి ప్రసాదరావు, జిఎం డిఐసి శ్రీధర్, వివిధ శాఖల బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

దగా, నయవంచన సిఎం జగన్

టిడిపి జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీష్

మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు నాగజగదీష్

ప్రజాశక్తి- అనకాపల్లి : వాడుకుని వదిలేయడం జగన్ రెడ్డి నైజమని, తన సొంత ప్రయోజనాల కోసం ఎవరినైనా బలిపెట్టడం అతని లక్షణమని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. చెప్పేదొకటి, చేసేదొకటిగా విశ్వసనీయత లేని జగన్ రెడ్డి 57 నెలల పాలనలో ప్రజలకు స్పష్టమైందని. మండిపడ్డారు. బుధవారం స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఎత్తుకొని పెంచిన చిన్నాన్నను అతి కిరాతకంగా హత్య చేసిన నేరస్తులను కాపాడుతున్న క్రూరమైన మనస్తత్వం జగన్ రెడ్డిదన్నారు. సొంత తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలను నమ్మించి మోసం చేశాడని, తన తండ్రి ఆత్మగా పేరుపడ్డ కెవిపి రామచంద్రరావు, నీడగా ఉన్న సూర్యుడు నేడు జగన్ రెడ్డి వెంట లేరన్నారు. నమ్మిన ఎమ్మెల్యేలకు ద్రోహం చేశారన్నారు. ఓట్లేసిన దళితులు, మైనార్టీలకు ద్రోహం చేసి, సిటిజన్ బిల్లుకు పార్లమెంట్లో ఓటు వేయించిన ఘనుడని నాగ జగదీష్ అన్నారు. ఎమ్మెల్యేలకు అభివృద్ధి నిధులు కేటాయించకుంటా, వారికి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలలో లబ్ధిదారుల ఎంపికలో ప్రాతినిధ్యం లేకుండా తన సొంత సైన్యంగా వాలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి ఎమ్మెల్యేల పరువు తీశారన్నారు. సిపిఎస్ రద్దు హామీపై ఉద్యోగ, ఉపాధ్యాయులను నట్టేట ముంచారన్నారు. నిరుద్యోగులు, మహిళలు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాలను సిఎం జగన్ మోసం చేసి ముంచేశారన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు డాక్టర్ కెకెవిఎ. నారాయణరావు మాట్లాడుతూ సబ్‌ప్లాన్‌నిధులు మళ్లింపు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీల 120 సంక్షేమ పథకాలు రద్దు చేశారన్నారు. 14 లక్షల ఎకరాల అసైన్మెంట్ భూములు కబ్జా చేశారని, బ్యాక్లాగ్ పోస్టులు 1.40 లక్షల భర్తీ చేయకుండా సామాజిక న్యాయం గొంతు కోశారని విమర్శించారు. సమావేశంలో బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాదంశెట్టి నీల బాబు పాల్గొన్నారు.

అవకాశమిస్తే అనకాపల్లి ఎంపీగా పోటీ

- డాక్టర్ బివి.సత్యవతి

ప్రజాశక్తి -అనకాపల్లి : వైసిపి అధినేత, ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అవకాశం ఇస్తే మరోసారి అనకాపల్లి ఎంపీగా పోటీ చేస్తానని ఎంపీ డాక్టర్ బి వి సత్యవతి వెల్లడించారు. బుధవారం తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్, మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎమ్మెల్యేల సహకారంతో తన ఐదేళ్ల పదవీకాలంలో పార్లమెంటరీ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. ఆయుష్మాన్ పథకంలో భాగంగా రూ.22.50 కోట్లతో ఎన్టీఆర్ వైద్యాలయ సూపర్ స్పెషాలిటీ క్రిటికల్ కేర్ సెంటర్‌ను ఈనెల 29న వర్చువల్ విధానంలో కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి మాండవియ ప్రారంభిస్తారన్నారు. పోర్టు, సిఎస్ఆర్ నిధులు రూ.25 లక్షలు, అలాగే జీవీఎంసీ, ఎంపీ లాడ్స్ తో అనకాపల్లి ఎన్టీఆర్ క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. మండలంలోని సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని రూ.36 లక్షలతో అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటక ప్రాంతంగా బొజ్జన్నకొండను అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగా రోడ్డు నిర్మాణం పూర్తిచేశామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గ్రామస్తులతో మాట్లాడుతున్న రత్నాకర్

ప్రజాశక్తి-కశింకోట : మండలంలో అచ్చెర్ల, మాసయ్యపేట పంచాయతీ గోకివానిపాలెం గ్రామాలలో బుధవారం అనకాపల్లి వైసిపి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ పర్యటించారు. ముందుగా అచ్చెర్ల గ్రామంలో సచివాలయం, ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి అసమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సర్పంచ్ నిమ్మదల సంస్యరరావు, నిమ్మదల సన్యాసినాయుడు, ఉప సర్పంచ్ దాడి శ్రీనివాసరావు పాల్గొన్నారు. గోకివానిపాలెంలో సీతారాములను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గోకివానిపాలెం పాఠశాలలో విద్యార్థులు నేలపై కూర్చుని చదువుతున్నారని, తన సొంత నిధులతో 12 బెంచీలు, అలాగు రామాలయంలో నాలుగు ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రైనేజీ, శ్మశానవాటిక, అక్కడ బోరు ఇతర సమస్యలను స్థానికులు రత్నాకర్ దృష్టికి తేగా, ఒక్కటొక్కటిగా పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోకివాడ గోవింద, గ్రామ యువకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ

ప్రిన్సిపల్‌కు విరాళం అందించిన పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక ఎఎంఎఎల్ కళాశాల నాక్ అక్రిడిటేషన్‌కు వెళుతున్న సందర్భంగా 1989 - 91 ఎంకామ్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.43 వేల విరాళం అందజేసారు.బుధవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గల్లా జయబాబు, పూర్వ విద్యార్థుల సంఘం అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డేడ అప్పారావులకు విరాళాన్ని అందజేస్తూ ఈ సొమ్ముతో రెండు కంప్యూటర్లు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులను ప్రిన్సిపాల్ జయబాబు అభినందించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ అప్పారావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులందరూ వీరిని స్ఫూర్తిగా తీసుకొని కళాశాల అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు కార్మిక సంఘాల మద్దతు

రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానం ... 29న జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీకి నిర్ణయం

ప్రజాశక్తి.-అనకాపల్లి : అంగన్వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లతో సమ్మెబాట పట్టిన అంగన్వాడీలకు మద్దతుగా ఐక్యంగా ఆందోళన చేయాలని, ఇందులో భాగంగా ఈనెల 29న జిల్లా కేంద్రంలో ర్యాలీ చేయాలని తీర్మానించారు. బుధవారం స్థానిక దొడ్డి రాము నాయుడు భవనంలో జిల్లా కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్వాడీలకు ముఖ్యమంత్రి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కోరారుజ సమ్మె చేస్తున్న అంగన్వాడీల పట్ల మంత్రులు ఎమ్మెల్యేలు చులకనగా మాట్లాడడం సరైనది కాదన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు

అంగన్వాడీల సమస్యలపై సుప్రీంకోర్టు తీర్పును బేఖాతరు చేయడం సమర్ధనీయం కాదన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, ఏఐటియుసి జిల్లా కన్వీనర్ భద్రం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కోన లక్ష్మణరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు,అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏం.దుర్గా రాణి, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ జిల్లా చైర్మన్ వి వి శ్రీనివాసరావు,విశాఖ జిల్లా గొర్రెల మేకల పెంపకదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంట శ్రీరామ్, మున్సిపల్ క్లాప్ డ్రైవర్ యూనియన్ అధ్యక్షులు శివ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివాజీ పాల్గొన్నారు. అంగన్వాడీలకు మద్దతుగా ఈ నెల 29న జిల్లా కేంద్రంలో ర్యాలీ చేయాలని నిర్ణయించారు.

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

రిలే సమ్మె దీక్షల్లో న్యాయవాదులు

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించలేని చట్టం 27/2023ను రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న బుధవారం 8 వ రోజు రిలే దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దుర్మార్గమన్నారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించలేని ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఆర్టికల్ 19కు విరుద్ధంగా చట్టాన్ని తీసుకురావడం తప్పుడు నిర్ణయంగా విమర్శించారు. జ్యుడీషియల్ నుంచి తప్పించి అధికారాన్ని ఎగ్జిక్యూటివ్‌కు ఇవ్వడం వల్ల సామాన్యులు ఆస్తులను నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. దీక్షలో అసోసియేషన్ అధ్యక్షులు శేఖర మంత్రి సాయి లక్ష్మణ్ ,సెక్రటరీ సూర శ్రీనివాస్ ,మద్దాల గోవింద్, మోహన్ ,కుమార్ ,సందీప్ శ్రీనివాస్ ,రామచంద్రరావు, రాంప్రసాద్, తిలక్, మల్లేష్, కిషోర్, మూర్తి, అవినాష్ రోజా, అరుణ పాల్గొన్నారు.

పాడి రైతులకు హెరిటేజ్ డెయిరీ బీమా

బీమా పరిహారం అందజేస్తున్న డెయిరీ మేనేజర్ శేషు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : హెరిటేజ్ డెయిరీ పాడి రైతులకు బీమా సదుపాయం కల్పించినట్లు హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కె. శేషు తెలిపారు. బుధవారం ఎర్రవరం గ్రామంలో సహజ మరణం పొందిన పాడిరైతు తోట వెంకన్న కుటుంబీకులకు రూ.50 వేల బీమా సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీకి పాలు సరఫరా చేసిన రైతులకు, వారి పాడి పశువులకు బీమా వర్తిస్తుందన్నారు. సభ్యరైతు సహజ మరణానికి రూ.50వేలు, ప్రమాద మరణానికి రూ.రెండు లక్షల బీమా పరిహారాన్ని డెయిరీ చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఏ నాగేశ్వరరావు, జి శ్రీను, జి రమణ , నాగేశ్వరరావు, ఎం లక్ష్మి, జి అప్పారావు ఎ.రమణ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి దేమునిగుమ్మం వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాల అనంతరం దేవాలయ చైర్మన్ సకల రాజ్యలక్ష్మి గోవిందరావు, ఇఒ టి. రాజసులోచన, ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. హుండీ లెక్కింపు పర్యవేక్షణ అధికారి కీర్తి శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహించిన హుండీ లెక్కింపులో భక్తులు హుండీలో రూ 5,16,099 కానుకలు వేసినట్లు ఆలయ చైర్మన్ సకల రాజ్యలక్ష్మి గోవిందరావు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ అధికారులు కె .ఆదినారాయణ, ధర్మకర్తలు సుంకర వెంకటేశ్వరరావు, సూరిశెట్టి చిన్న సన్యాసిరావు, ముమ్మిని పైడిరాజు, శ్రీధరాల కోమలి రామ్మోహన్, రాజాన లక్ష్మీ శ్రీనివాసరావు, బెల్లాన అనురాధ ఎక్స్ అఫిషియో మెంబర్ పులఖండం గిరిబాబు, దేవాలయ సిబ్బంది శ్రీహరిసేవ వాలంటీర్లు పాల్గొన్నారు.

వెంకటేశ్వర ఆలయ హుండీలో కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

'ఉన్నతి' ఆటోలతో మహిళలకు మేలు

ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

లబ్ధిదారులకు ఆటో తాళం ఇస్తున్న ఎంపి, ఉపముఖ్యమంత్రి

ప్రజాశక్తి- అనకాపల్లి : నిరుపేద ఎస్‌సి మహిళలకు మహిళా శక్తి ఆటో రిక్షా ఉన్నతి పథకంలో మహిళా సంఘాల ద్వారా వడ్డీలేని రుణాలిచ్చి, వారికి స్థిరమైన జీవనోపాధి కల్పించాలన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆలోచన గొప్పదని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో జిల్లాలోని 9మంది ఎస్‌సి మహిళలకు ఉన్నతి పథకంలో మంజూరైన ఆటోలను ఎంపీ డాక్టర్ బివి. సత్యవతి, రవి పట్టన్‌శెట్టితో కలిసి అందజేశారు. ఈ సందర్భంఆ మాట్లాడుతూ,.లబ్ధిదారులు వాహనం ఖరీదులో 10 శాతం చెల్లించగా మిగిలిన 90 శాతం మొత్తాన్ని వడ్డీలేని రుణంగా అందజేసి, ఒక్కొక్కరికి రూ. 3,03,434ల విలువైన ఆటోను అందజేశామన్నారు. ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఉన్నతి పథకంలో మహిళా సాధికారతకు మహిళా శక్తి పథకం కింద జిల్లాలోని మాడుగుల పాయకరావుపేట కోటవురట్ల సబ్బవరం మునగపాక అచ్యుతాపురం బుచ్చయ్యపేట రావికమతం చోడవరం మండలాల మహిళలకు ఆటోలు అందజేశామన్నారు. మహిళా డ్రైవర్లు ఆటోలను నడిపి చూపించారు.కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శచీదేవి, గ్రామవార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులవాణి, ఎపిడి డైజీ పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ ఉత్సవ మండపం ప్రారంభం

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి గవరంపాలెంలోని నూకాంబిక దేవస్థానంలో ఉత్సవ మండపాన్ని ప్రారంభించారు. అలాగే దేవాలయం పునర్నిర్మాణంలో భాగంగా అమర్చబోయే శిలలకు పూజలు చేశారు. ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఇఒ బండారు ప్రసాద్, ధర్మకర్తలమండలి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో పూర్వ ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంజూరు చేసిన ప్రభుత్వ నిధులతో పాటు, దాడి సన్యాసిరత్నం (అమ్మలు) అందించిన విరాళంతో ఉత్సవ మండపాన్ని నిర్మించగా, వైసిపి అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్, నాయకులు దాడి జయవీర్ ప్రారంభించారు. వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, కార్పొరేటర్‌లు కొణతాల నీలిమ భాస్కర్, పీలా లక్ష్మి సౌజన్య, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ రామమూర్తి, ధర్మకర్తల మండలి సభ్యులు బుద్ధ నర్సింగరాజు, పీలా లక్ష్మి శ్రీనివాసరావు, ఆడారి ఉమా శ్రీనివాసరావు, కొండూరి రవీంద్రనాథ్, గొల్లవిల్లి నర్సింగరావు, పాము అనురాధ సన్నిబాబు, కంటపల్లి శోభారాణి వెంకటరావు, మల్లవరపు ఈశ్వర్రావు, అర్చకులు యనమండ్ర శ్రీనివాస్ పాల్గొన్నారు. కార్యక్రమం లో మార్కెట్ కమిటి చైర్మన్

ఉత్సవ మండపాన్ని ప్రారంభిస్తున్న రత్నాకర్

గొల్లవిల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ లు బొడ్డేడ శివ, శిలపరశెట్టి పలు దేవస్థానాలచైర్మన్‌లు మళ్ల రాజా,కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు,(ఆళ్ల నాగేశ్వర్రావు, కేయం. నాయుడు, సకల రాజ్యలక్ష్మి గోవింద, ఎస్‌డి గ్రూప్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్, విల్లూరి శివసూరి, డాక్టర్ బొడ్డేడ నర్సింహారావు, బొడ్డేడ శంకరరావు,కడిమిశెట్టి సతీష్, ఎల్లపు శ్రీనివాస్, పిఎస్‌కే నాయుడు, శ్రీధరాల మనోజ్, కొణతాల శ్యాం, కొణతాల కృష్ణంరాజు, డీజే నాయుడు, కొణతాల పరదేశీనాయుడు, విజ్జపు వాసు, పెంటకోట కోదండపాణి , శిలపరశెట్టి గిరి, పొలిమేర శ్రీను, రేబాక మధు, మేడిశెట్టి గణేష్, వాసుపల్లి తాతయ్యలు, కోటిపల్లి శ్రీను,కాండ్రేగుల సోమేశ్, మద్దాల భీమేష్, గండేపల్లి మురళి పాల్గొన్నారు.

నేడు విఆర్‌ఎల సభ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : తమ సమస్యల పరిష్కారానికి ఈనెల 28న గురువారం అనకాపల్లిలో సభను నిర్వహిస్తున్నట్లు విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బొడ్డు శ్రీను,బండి రామారావు తెలిపారు. తమ సమస్యల పై డిప్యూటీ తహశీల్దార్ అరుణ్ చంద్రకు వినతిపత్రం అందజేశారు. విఆర్‌ఎలకు టైంస్కేల్ అమలు చేసి, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, అర్హులైన విఆర్‌ఎలను అటెండర్లు, విఆర్‌ఒలుగా ప్రమోషన్లు కల్పించాలని కోరారు.

డిటికి వినతి పత్రం అందజేస్తున్న విఆర్‌ఎల సంఘ నేతలు

అనకాపల్లి సభను జయప్రదం చేయాలని కోరారు.

ఉల్లాసంగా 'ఆడుదాం ఆంధ్రా'

కబడ్డీ విజేతగా నిలిచిన అప్పారావు జట్టు

ప్రజాశక్తి - యంత్రాంగం

పరవాడ: మండలలోని పెదముషిడివాడ పంచాయతీలో ఆడుదాం ఆంధ్రలో భాగంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో కబడ్డీ అప్పారావు జట్టు విజేతగా నిలిచింది. పెద్దముషిడివాడ సచివాలయం పరిధిలో ఐదు కబడ్డీ జట్లు పోటీపడగా, అప్పారావు జట్టు విజేతగానిలవడంతోపాటు ఆ జట్టులోని పలువురు ఆటగాళ్ల ఉత్తమ ప్లేయర్లుగా ఎంపికయ్యారు. సచివాలయ స్థాయిలో గెలుపొందిన జట్లు మండలస్థాయిలో పోటీ పడనున్నాయి.

ఆనందపురం : మండలంలోని తర్లువాడ గ్రామంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను స్థానిక సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వేపగుంట : జివిఎంసి 93వ వార్డు పరిధి సాయిమాధవనగర్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించారు.

కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుతూ ఆంధ్రలో భాగంగా బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. తంగేడు గ్రామంలో మండల ప్రత్యేక అధికారి మాధవి క్రీడలను పరిశీలించారు. పలు గ్రామాల్లో గ్రామస్తులు క్రీడలలో పాల్గొన్న కాకపోవడం పట్ల అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి భానోజీ రావు, పలు గ్రామాల కార్యదర్శిలు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా ఆడుదాం ఆంధ్రా

ప్రజాశక్తి-వేపగుంట : ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం వేపగుంట ప్రాంతంలో తూతూ మంత్రంగా సాగుతోంది. ఈ పోటీలకు సంబంధించి పెద్దగా ప్రచారం నిర్వహించలేదు. దీంతో క్రీడాకారులు అతి తక్కువ మందే వచ్చారు. కనీసం బ్యానర్లు కూడా ఏర్పాటుచేయలేదు. క్రికెట్ పోటీల్లో కనీస నియమ నిబంధనలు పాటించలేదు. బౌండరీ లైను, ఫస్ట్ సర్కిల్‌ను గీయలేదు. క్రికెట్ పోటీల నిర్వహణలో అధికారులకు, సచివాలయ సిబ్బందికి సమన్వయలోపం కనిపించింది. దీంతో ఆట ప్రారంభానికి గంటల కొద్దీ వేచి చూడాల్సి వచ్చింది. జోన్-8 ఇంజినీరింగ్ అధికారి విజయ్‌కుమార్ ఈ పోటీలకు హాజరయ్యారు. ఆటల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై జోనల్ కమిషనర్‌ను ప్రజాశక్తి ప్రశ్నించగా సచివాలయాలకు కిట్లు పంపిణీచేశామని, పోటీల నిర్వహణపై దృష్టిసారిస్తామని చెప్పారు. పోటీల నిర్వహణ గురించి సమాచారం ఇవ్వలేదంటూ సచివాలయ సిబ్బందిపై వైసిపి నాయకులు రుసరుసలాడుతున్నారు.

బకాయిలు చెల్లించాలని యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ భీమిలి మండల కమిటీ ఆధ్వర్యాన బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షులు ఎ.పైడిరాజు మాట్లాడుతూ, ఉద్యోగుల మద్దతుతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను విస్మరించిందన్నారు. ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించాలని, పిఆర్‌సి, ఎరియర్స్, పిఎఫ్ బకాయిలు, ఎపిజిఎల్ఐ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర స్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ సిహెచ్‌వి.రమేష్‌కు యూనియన్ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పాడ రాము, మండల అధ్యక్షులు ఎం.రామకృష్ణ, ఆడిట్ కమిటీ జిల్లా సభ్యులు అప్పల శ్రీను, నాయకులు రాంబాబు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు

పెందుర్తి : పెందుర్తి తహశీల్దార్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు దాదాపు రూ.18 వేల కోట్ల ఆర్థిక బకాయిలు చెల్లించేక నిలిచిపోయాయన్నారు. అవసరాల కోసం ఉపాధ్యాయులు దాచుకున్న డబ్బులను పొందలేని దుస్థితి ఏర్పడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరచి ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పెందుర్తి తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తడనా అప్పారావు, జిల్లా సహాధ్యక్షులు ఎన్.ప్రభాకర్, రొంగలి ఉమ, జిల్లా కోశాధికారి కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులు చుక్క సత్యం, నాయకులు సామా రాజులు, ఎర్రినాయుడు, బిఎన్.రవి, అవతారం తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బుధవారం ఆందోళన చేపట్టారు. ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలని , పిఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు 18,096 కోట్లు చెల్లించాలని, , బకాయి పడ్డ డిఏలు వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, జీవో 117ని, సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే దశలవారిగా ఆందోళన ఉధృతం చేస్తామని ఉపాధ్యాయులు స్పష్టం చేశారు. యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కట్టా శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి జె రాజేష్ , జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జి.రాజబాబు, నక్కపల్లి అధ్యక్షులు డిరికె శాస్త్రి, సీనియర్ నాయకులు పి.వెంకటరావు, ప్రధాన కార్యదర్శి జి.మహేష్, కెవిసి సత్యనారాయణ, రాంబాబు, పి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పెందుర్తిలో ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

30న సాధికార బస్సు యాత్ర

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నంలో ఈ నెల 30న జరిగే సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ పిలుపు నిచ్చారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గం ముఖ ద్వారమైన మాకవరపాలెం మండలం శెట్టిపాలెం వద్ద సామాజిక సాధికార బస్సు యాత్రకు వస్తున్న నాయకులకు స్వాగతం పలుకుతారన్నారు. నర్సీపట్నం నుంచి సుమారు 1000 బైకులతో నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి బస్సు యాత్రకు స్వాగతం పలకాలని నిర్ణయించామన్నారు. అనంతరం మాకవరపాలెం మండలం రామన్నపాలెం వద్ద మెయిన్ రోడ్డును ఆనుకుని నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల పనులను పరిశీలిస్తారన్నారు. అనంతరం అక్కడి నుంచి ముందు బైక్ ర్యాలీ, వెనక బస్సుయాత్ర నర్సీపట్నం అబిద్ సెంటర్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సభ ప్రారంభ మౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రదర్శన చేపడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సాగు ఆవశ్యకతపై ప్రదర్శన

ప్రజాశక్తి పాయకరావుపేట: స్థానిక శ్రీచైతన్య స్కూలులో జైకిసాన్ -జైభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ సుంకర బుజ్జిబాబు వ్యవసాయం ఆవశ్యకతను వివరించారు. రైతే దేశానికి వెన్నుముక అని, రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కార్యక్రమాన్ని అమలు చేయడం హర్షణీయమన్నారు. విద్యార్థులు పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక వై.జంక్షన్ వద్ద విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో ఏజీయమ్ .సురేష్, ఆర్ఐ గోపీనాథ్, ప్రిన్సిపల్ మాణిక్యాలరావు, ప్రిన్సిపల్ మాణిక్యాలరావు ,అకాడమిక్ కోఆర్డినేటర్ వెంకట రమణ,ఏవో విజయ్, బ్యాచ్ ఇన్చార్జ్ లోవేష్, ప్రైమరీ ఇన్చార్జ్‌లు వేణి ప్రియ, కల్పన, ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ గౌరి పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి -రోలుగుంట: మండలంలోని రత్నంపేట పంచాయతీ పనసలపాడు గ్రామంలో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించాలని ఆదివాసీ గిరిజన మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ, గ్రామంలో భగత ఆదివాసీ గిరిజనులు 50 మంది జనాభా ఉన్నారన్నారు. జిల్లా కలెక్టర్ పనసలపాడు గ్రామాన్ని సందర్శించి నేటికి రెండు సంవత్సరాల క్రితం పర్యటించి జల జీవన్ మిషన్ ద్వారా మంచినీరు సదుపాయం కల్పించాలని ఆదేశించారని, దీని కోసం ఎనిమిది లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ ఆదేశాలు అమలు చేసి ఈ పనులను ప్రారంభించాలని, లేదంటే సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

నినాదాలు చేస్తున్న ఆదివాసీలు

హంస వాహనంపై ఊరేగిస్తున్న పురోహితులు

ఘనంగా వెంకన్న తిరువీధి సేవ

ప్రజాశక్తి-నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం హంస వాహనంపై తిరువీధి సేవ నిర్వహించారు. ఆలయంలో అర్చక బృందం ఆధ్వర్యంలో నిత్య పూజలు పూర్తి చేసిన అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారిని హంస వాహనం, గోదాదేవి అమ్మవారిని పల్లకిలోను అధిష్టింప చేసి గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు. ఆస్థాన మండపంలో ద్రావిడ వేద ప్రబంధ పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలచార్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

132 మందికి పింఛన్లు మంజూరు

ప్రజాశక్తి -మాకవరపాలెం: మండలంలో కొత్తగా మరో 132 మందికి పింఛన్లు మంజూరయ్యాయని ఎంపిడిఒ సిహెచ్.సీతామహాలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, గత జులై నెల నుండి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హత ఉన్నందరికీ పింఛన్లు మంజూర య్యాయన్నారు. మండలంలో వికలాంగ, వృద్ధాప్య, వితంతు తదితర పింఛన్లు 10347 మందికి పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి-రోలుగుంట: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని బిబి.పట్నం గ్రామంలో హెచ్ఐవిపై అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, లింక్ వర్కర్ స్కీమ్ ద్వారా గ్రామంలో ప్రతీ ఒక్కరు రక్తపరీక్షలు చేయించు కోవాలన్నారు. హెచ్ఐవి వ్యాధిగ్రస్తులపై వివక్ష చూప రాద న్నారు. ఈ కార్యక్రమంలో సచివాల య సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నిలిచిన సంచార పశు వైద్య సేవలు

ప్రజాశక్తి -కోటవురట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన సంచార పశు వైద్య ఆరోగ్య సేవలు గడిచిన రెండు రోజులుగా నిలిచి పోయాయి. ఈ విషయమై సంచార వాహన పశు వైద్యులు అశోక్‌ను ఆరా తీయగా ఇంధనం కొరత ఉందని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి పశు వైద్యం నిమిత్తం రైతులు హెల్ప్ లైన్‌కు ఫోన్ చేస్తున్నట్లు ఈ సందర్భంగా అన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రేషన్ సకాలంలో అందజేయాలి

ప్రజాశక్తి-కోటవురట్ల: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందజేస్తున్న రేషన్ సరుకులను సకాలంలో అందజేయాలని సిఎస్‌డిటి అప్పలనాయుడు ఆదేశించారు. బుధవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, వాహన డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంటికి రేషన్‌ను తీసుకువెళ్లి ఇవ్వాలన్నారు. పంపిణీపై నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. కందిపప్పు, గోధుమపిండి రేషన్ దుకాణాలకు ఇవ్వక పోవడంతో లబ్ధిదారులతో వివాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు తెలిపారు.

కుళాయి పైపులు దగ్ధం

ప్రజాశక్తి -కొత్తకోట: కొత్తకోట జడ్పీ పాఠశాల ఆవరణలో బుధవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇంటింటి కొళాయిలకు చెందిన పైపులు అగ్నికి కాలి బూడిదయ్యాయి. గ్రామంలో ఇంటింటికి తాగు నీరు అందించాలన్న సంకల్పంతో సుమారు రూ 7 కోట్ల జల జీవన్ పథకం నిధులు మంజూరు కాగా ప్రస్తుతం గ్రామంలో పనులు జరుగుతున్నాయి. ఆ పనులకు సంబంధించిన పైపులు స్థానిక జడ్పీ పాఠశాల ఆవరణలో స్టాక్ చేశారు. బుధవారం సాయంత్రం పాఠశాలకు చెందిన మహిళా స్వీపర్ చెత్తకు నిప్పు పెట్టడంతో ఆ నిప్పు రవ్వలు ఎగసి పడి పైపులకు అంటుకున్నాయి.

మోటారు చోరీ

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తరచూ దొంగతనాలు చోటు చేసుకుం టున్నాయి. బోర్ నుండి సబ్మెర్సిబుల్ మోటార్ దొంగతనం చోటు చేసుకోవడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇదే స్థానంలో మోటారు దొంగతనం జరిగినట్లు అధికారులు తెలిపారు. అదే స్థానం నుండి బుధవారం దొంగతనం జరగడంతో ఇంజనీరింగ్ అధికారులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ మేరకు పోలీసులు దొంగతనం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు.

మందులు ఇస్తున్న వైద్యులు

130 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-మాడుగుల: మండలంలోని వంటర్లపాలెంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బుధవారం మండలంలోని వంటర్లపాలెం గ్రామ పంచాయతీలో భానోదయా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు సొసైటీ అధ్యక్షుడు రాపేటి రామ కొండలరావు(మాస్టారు) తెలిపారు. కేజే పురం,వంటర్లపాలెం గ్రామాలకు చెందిన 130 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు ఆయన తెలిపారు. వీరిని పరీక్షించిన విశాఖపట్నం చెందిన అనిల్ నీరుకొండ వైద్యాలయం వైద్యులు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమారరాజు, ఆడారి కన్నారావు, వీఆర్వో రాజు, సిబ్బంది వెంకటరావు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి

- భారీ ర్యాలీలు, బైఠాయింపు
16వ రోజు అంగన్‌వాడీల సమ్మె ఉధృతం

నర్సీపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె సోమవారం 16వ రోజుకు చేరింది. ఎమ్మెల్యే, ఎంపి, మంత్రుల క్యాంపు కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టారు. సమస్యలను పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

అనకాపల్లి : నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీలు , యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం స్థానిక ఎంపీ డాక్టర్.భీసెట్టి సత్యవతి, అనకాపల్లి ఎమ్మెల్యే , పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ క్యాంపు కార్యాలయాలను ముట్టడించారు. అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని, ప్రభుత్వం గత నాలుగేళ్లుగా ధరలు పెరుగుతున్నా జీతాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేస్తారు. తక్షణం జీతాలు పెంపు చేయాలని ముఖ్యమంత్రి పై ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు ఒత్తిడి చేయాలని నినదించారు. ఎంపీ సత్యవతి అంగన్వాడీ వద్దకు వచ్చి వారి సమస్యలను విని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు.ముందుగా నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించి మంత్రి గుడివాడ అమర్నాథ్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడి చేశారు. అక్కడ కార్యాలయ ఇన్చార్జికి వినతి పత్రం ఇచ్చారు. అంగన్వాడీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం దుర్గారాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగ శేషు, ఉమా నారాయణమ్మ ,రామలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఏఐటియుసి నాయకులు వై.ఎన్ భద్రం, కోన లక్ష్మణ, రైతు కూలి సంఘం నాయకులు కే.మోహన్ రావు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి మాణిక్యం, గంటా శ్రీరామ్, వీవీ శ్రీనివాసరావు మద్దతు తెలిపారు.

దేవరాపల్లి : మండలంలోని తారువలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలునాయుడు క్యాంపు కార్యాలయం ఎదుట అంగన్వాడీలు అందోళన చేసి, వినతిపత్రం సమర్పించారు, డిప్యూటీ సిఎం స్పందించి,ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి అంగన్వాడీలు సమస్యలు తీసుకువెళ్తామని హామి ఇచ్చారు, అనంతరం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి వెంకన్న ఆధ్వర్యంలో నాలుగు మండలాల అంగనవాడి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు కార్యక్రమంలో. ప్రాజెక్టు కార్యదర్శి జి.వరలక్ష్మి గౌరవాధ్యక్షురాలు జి,కూమారి ప్రాజెక్టు అధ్యక్షరాలు భవానీ కోమాలి అమ్మాజి సన్యాసమ్మ, సిఐటియు జిల్లా నేత ఆర్ దేముడు నాయుడు, ఇ నరసింహమూర్తి, బిటి దొర మద్దతు పలికారు

చోడవరం : అంగన్వాడీల ఆందోళనలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కార్యాలయాన్ని అంగన్వాడీలు ముట్టడించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో లేకపోవడంతో పిఎకు వినతిపత్రం అందింఆచరు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయంలోని యువతి ఒకరు అంగన్వాడీల దీక్షకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐటియు నాయకులు జీ వరలక్ష్మి, ఎస్వి నాయుడు, నాలుగు మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో మంత్రి బూడిని నిలదీస్తున్న అంగన్‌వాడీలు

పరవాడ: మండలంలో దలాయిపాలెంలోని ఎమ్మెల్యే అదీప్‌రాజు క్యాంప్ కార్యాలయాన్ని అంగన్వాడీలు ముట్టడించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు సిహెచ్ దేవి, జి అమ్మాజీ, వరలక్ష్మి, వెంకటి, లక్ష్మి, పార్వతి, భవాని, కనక లక్ష్మి, పాల్గొన్నారు

సబ్బవరం : అంగన్వాడీల ఆందోళనల్లో భాగంగా బుధవారం పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఇంటికి వెళ్లి నిరసనలు వ్యక్తం చేశారు.ఎమ్మెల్యే అందుబాటులో లేకపోడంతో ఎమ్మెల్యే సోదరులు అజయ్‌రాజ్‌కు సమస్యల పై వినతిపత్రాన్ని అందజేశారు. అంగన్వాడీల సమ్మెకు గుల్లేపల్లి పిహెచ్‌సి ఆశావర్కర్ల యూనియన్ నాయకులు కె. అరుణ, జి. వరలక్ష్మి మద్దతు పలికారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వి.వి.రమణమ్మ, ఎం. వరలక్ష్మి, పుష్ప, జగదీశ్వరి, వి. సుభాషిణి, ఎం. కనకమ్మ,జి. అరుణ కుమారి,ఎస్. రమణమ్మ, డి. భారతి, ఎ. రమణమ్మ, పి. సూరమ్మ, ఎన్. సత్యవేణి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : అంగన్వాడీలసమ్మెలో భాగంగా మండలంలో పలు గ్రామాల్లో అంగన్వాడీలు చోడవరం ఎమ్మెల్యే ధర్మ శ్రీ కార్యాలయం ముట్టడికి తరలి వెళ్లారు.

కె.కోటపాడు : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మాడుగుల. కే కోటపాడు ప్రాజెక్టు పరిధిలోనిఅంగన్వాడీలు బుధవారంఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును తమ క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి కుమారి పి భవాని పాల్గొన్నారు.

అచ్యుతాపురం : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం మండల కాంప్లెక్స్ వచ్చిన ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజును చుట్టుముట్టి ప్రశ్నించారు. వినతిపత్రాన్ని అందజేశారు. కలిశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము, మండల శాఖ అధ్యక్షుడు కే సోమ నాయుడు, మరియు అంగన్వాడి కార్యకర్తలు హెల్పర్స్ ఎలమంచిలి ప్రాజెక్టు పరిధి అధ్యక్ష కార్యదర్శులు బి జయ, రామలక్ష్మి పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: పట్టణంలో అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె 16వ రోజుకు చేరింది. బుధవారం పెదబొడ్డేపల్లి మార్కెట్ నుండి ర్యాలీగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ, కనీస వేతనాలు, గ్రాడ్యూటీ అమలు, ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంపు వంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఐద్వా జిల్లా ఉపాద్యక్షలు ఎల్.గౌరి, కేవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) గొలుగొండ ప్రాజెక్టు నాయకులు వి.సామ్రాజ్యం, మహాలక్ష్మీ, ఎం.మంగతాయారు, సిహెచ్.భ్రమరాంభ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో ఎమ్మెల్యే ఇల్లు ముట్టడి

అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు, రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు, దళిత నాయకులు నేతల నాగేశ్వరరావు, డి కేఎస్ఎస్ అధ్యక్షులు గాతాడు సహదేవుడు, దళిత బహుజన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కిడారి మల్లేశ్వరరావు, విదసం నాయకలు ఎల్లాజీ, దళిత నాయకులు మత్ర గోపి, కేవిపిఎస్ నాయకులు ఈరెల్లి చిరంజీవిలు మద్దతు తెలిపారు.

యస్.రాయవరం: స్థానిక ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించారు. సిఐటియు నేత యం.అప్పలరాజు, అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు సుబ్బలక్ష్మిల ఆధ్వర్యాన అడ్డురోడ్డులో ఫ్లైఓవర్ నుండి కొరుప్రోలులోని స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటి వద్దకు ర్యాలీ వచ్చి ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటి వద్ద బైఠాయించి నిరసన తెలిపారు.

యలమంచిలిలో ఎమ్మెల్యే కన్నబాబుకు సమస్యలు తెలుపుతున్న అంగన్‌వాడీలు

విశాఖ

కలెక్టరేట్ : జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద వందలాది మంది అంగన్వాడీలు పళ్లాలను గరిటెలతో మోగిస్తూ నిరసన తెలిపారు. చాలీచాలని వేతనాలతో బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై.తులసి, గౌరవ అధ్యక్షురాలు పి.మణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి నాయకులు పి.శ్యామలాదేవి, ఐఎఫ్‌టియు నాయకులు పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.శ్రీభరత్, దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ మద్దతు తెలిపారు.

భీమునిపట్నం : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే రావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎంతకీ క్యాంప్ కార్యాలయానికి ఆయన రాకపోవడంతో సిఎం డౌన్ డౌన్, ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఎండకు తాళలేక సాగర్‌నగర్ ముసలయ్యపాలేనికి చెందిన హెల్పర్ కె.రమణమ్మ, మధురవాడ సెక్టార్, వాంబే కాలనీ, సంతోష్ నగర్- 2 అంగన్వాడీ వర్కర్ సిహెచ్ చెంచులక్ష్మి, పద్మనాభం మండలం, రెడ్డిపల్లి సెక్టార్, అనంతవరం గ్రామానికి చెందిన అంగన్వాడీ వర్కర్ ఆర్ఎంపద్మావతి స్పృహ తప్పి పడిపోయారు. వీరికి తోటి వర్కర్లు సహాయక చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు సిఐటియు జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి, అధ్యక్షులు రవ్వ నరసింగరావు, అంగన్వాడీ యూనియన్ ప్రతినిధులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రతినిధులు కె.వెంకటలక్ష్మి, పద్మావతి, కొవ్వాడ లక్ష్మి, ఎఐటియుసి నాయకులు అనురాధ పాల్గొన్నారు. ముట్టడికి ముందు శాఖా గ్రంథాలయం నుంచి బీచ్ రోడ్డు మీదుగా ర్యాలీ చేశారు. అంగన్‌వాడీల ఉద్యమం ఉధృతం అవుతున్న వేళ 'చర్చలు విఫలం.. ఉద్యమం ఉధృతం' ప్రధాన శీర్షికన ప్రజాశక్తి దినపత్రిక ప్రచురించిన ప్రత్యేక సంచికకు అంగన్‌వాడీల నుంచి విశేష ఆదరణ లభించింది. అందరూ ఆసక్తిగా చదివారు.

పెందుర్తి : మండలం రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు ఇంటిని అంగన్‌వాడీ కార్యకర్తలు ముట్టడించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జగన్ మాట్లాడుతూ, ముట్టడి ఉందని ఎమ్మెల్యేలు ఉదయాన్నే ఇల్లు విడిచి వెళ్లిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో పడాల రమణ, అంగన్‌వాడీ రాష్ట్ర యూనియన్ ఉపాధ్యక్షులు బృందావతి, భవాని, దేవి తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో కంచాలు మోగిస్తున్న అంగన్‌వాడీలు